# సాక్షి సిద్దిపేట

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023






## అదృశ్యమై.. చెరువులో శవమై

మూడు రోజుల క్రితం గురుకులం గోడదూకి వెళ్లిన నలుగురు విద్యార్థుల్లో ముగ్గురు అదే రోజు తిరిగి రాగా.. ఒకరు ఆదివారం చెరువులో శవమై తేలాడు. 8లో..




## పొంచి ఉన్న ప్రమాదం

గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. చుట్టూ కంచె లేకపోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. 9లో..

## ప్రశాంతంగా మోడల్‌స్కూల్స్ ప్రవేశ పరీక్ష

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 3,725 మంది విద్యార్థులకు గాను 3,228 మంది పరీక్షకు హాజరవగా, 497 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.




## న్యూస్‌రీల్

### ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



జెండా పాతుతున్న సీపీఎం నాయకులు

కొముురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌లో గతంలో పేదలకు పంపిణీ చేసిన స్థలంలో ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యకర్తలు, ప్రజలతో కలిసి సదరు స్థలంలో పార్టీ జెండాలను పాతారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1995 సంవత్సరంలో ఐనాపూర్, రసులాబాద్‌లో సర్వే నంబర్ 213లో 86 మందికి ఇళ్ల పట్టాలు అందించారని, పంచాయతీ రికార్డుల్లో ఇళ్ల స్థలాలుగా రికార్డు అయిన భూమి ధరణి వచ్చాక పట్టేదారు మళ్లించి తన పేరుమీదికి మార్చుకున్నారని అన్నారు. పాస్‌బుక్‌ను రద్దుచేసి ఆ స్థలంలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్, మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, అయినాపూర్ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, శారద, దాసరి ప్రశాంత్, అరుణ్ కుమార్, బక్కెల్లి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు పుస్తకావిష్కరణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కవి, రచయిత, కొండిమల్లారెడ్డి రచించిన 'ఇప్పుడొక ఊరుకావాలి' పుస్తకావిష్కరణ సభ సోమవారం నిర్వహించనున్నట్లు వెన్నెల సాహితీ సంగమం జిల్లా అధ్యక్షుడు వంగర నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్కపెల్లి యాదగిరి తెలిపారు. సాయంత్రం 5గంటలకు జిల్లా కేంద్రంలోని శివానుభవ మండపంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం చేతుల మీదుగా పుస్తకావిష్కరణ ఉంటుందన్నారు. కవులు, రచయితలు, సాహితీ అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారు తెలుగు వెలుగు జాతీయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని తెలుగు వెలుగు సాహిత్య వేదిక స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పోలోజు రాజ్‌కుమార్ తెలిపారు. సాహిత్యం, రచన, కవులు, కళాకారులు, సంగీతం, నృత్యం, భరత నాట్యం, కూచిపూడి, కోలాటం, చిత్రలేఖనం, శిల్పం , నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానం, విద్య, వైద్యం, ఇంద్రజాలం, ముఖాభినయం, హరికథ, బుర్రకథ, ఒగ్గు కథ, రంగస్థల కళాకారులు, జ్యోతిష్యం, వాస్తు, యోగా, సామాజిక సేవా, క్రీడలు, షార్ట్ ఫిలిం, పర్యావరణ పరిరక్షణ, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి గ్రామీణ అభివృద్ధి, పట్టణ, గ్రామీణ స్థాయి ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల్లో కృషి చేస్తున్న వారు మే 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 25న గుంటూరులో పురస్కారాల ప్రదానం ఉంటుందని తెలిపారు.

### సీపీఎస్‌ను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సిద్దిపేటకమాన్: ఉద్యోగ ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో కాన్‌స్టిట్యూషనల్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయులకు పెన్షన్ హక్కు సాధించేందుకు ఈ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు మద్దతు తెలిపారన్నారు. కార్యక్రమంలో దేవరాజ్, కిషన్, రమేష్, శ్రీనివాస్, భాస్కర్, తిరుపతిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, శశిధరశర్మ, మల్లిఖార్జున్, కరుణశ్రీ, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# జైలుకు పోతాం.. అవకాశం కల్పించండి

- కరోనా తర్వాత మ్యూజియం జైలు మూత
- శిథిలావస్థకు చేరిన భవనం
- పునరుద్ధరించాలని కోరుతున్న పర్యాటకులు

సంగారెడ్డి టౌన్: జైలు.. ఈ పేరు వింటే అందరికీ గుర్తొచ్చేది ఖైదీలు. తెల్లని చొక్కా, దాని మీద నెంబరు.. తెల్ల నిక్కర్.. తెల్ల టోపీ. అయితే జైలు జీవితం ఎలా ఉంటుందో తెలుసుకోవాలనే వారికోసం తెలంగాణ ప్రభుత్వం 2016లో 'ఫీల్ ది జైల్' పేరుతో సంగారెడ్డిలో ప్రత్యేక కారాగారం ఏర్పాటు చేసింది. దేశంలోనే మొదటి మ్యూజియం, జైలు కూడా ఇదే.



సంగారెడ్డిలో మూతపడిన ఫీల్ ది జైల్

**నిజాం కాలంలో..**

నిజాం కాలంలో మొదట సంగారెడ్డి జైలు ఏరియాలో గుర్రపుశాల నిర్మించారు. ఆ తర్వాత బ్రిటీష్ ప్రభుత్వం అదే ఏరియాలో 1.5 ఎకరాల్లో జైలు ఏర్పాటు చేశారు. ఇందులో పదుల సంఖ్యలో బ్యారక్‌లు ఉన్నాయి. ఒక్కోదానికి తెలంగాణ, మొఘల్, నిజాం చరిత్ర, భారత స్వాతంత్ర్య ఉద్యమ సంఘటనల పెయింటింగ్ వేయించారు. బ్రిటీష్ కాలం నాటి ఫొటోలు కూడా గదుల్లో ఏర్పాటు చేయించారు. టైపు రైటర్లు, అప్పటి రేడియోలు, పెన్నులు, వాల్ క్లాక్ లు, గంటలు.. ఇలా ప్రతీ వస్తువు ప్రదర్శన కోసం ఉంచారు.

**జైలు జీవితం అనుభవించాలనుకునే వారికి..**

జైలు మ్యూజియమే కాదు.. జైలు జీవితాన్ని అనుభవించాలనుకునేవారికి అధికారులు సంగారెడ్డి జైలులో అవకాశం కల్పించారు. ఇందుకోసం రోజుకు రూ. 500 చెల్లించాలి. వారికి సాధారణ ఖైదీలాగే ఖాదీ దుస్తులు, చొక్కా, నిక్కర్ లేదా ప్యాంట్, ప్లేట్, గ్లాస్, మగ్గు, సబ్బు, మంచి భోజనం, నిద్రించేందుకు దుప్పట్లు తదితర సౌకర్యాలు కల్పించారు. టీ, టిఫిన్ ఇచ్చేవారు. యోగా, క్రమశిక్షణ నేర్పించారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లాకప్‌లో ఉంచేవారు. గతంలో ఇక్కడ సినిమా షూటింగ్‌లు కూడా జరిగేవి. జాతిరత్నాలు సినిమాతో పాటు ఇతర సినిమాల్లో జైళ్ల సీన్ల షూటింగ్ కూడా ఇక్కడే జరిగాయి.



పాత జైల్ మ్యూజియంలో గంటను మోగిస్తున్న కేరళకు చెందిన బాబీ చెమ్మనూర్ (ఫైల్)



జైలులో మలేషియా వాసులు (ఫైల్)

**ఉదయం 6.30 నుంచే..**

ఉదయం 6.30 గంటల నుంచి వ్యాయామం, యోగా శిక్షణ ఉండేది. 7.30 గంటలకు టీతో పాటు టిఫిన్, తర్వాత పరేడ్ 8 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యాదానం ఉండేది. 9.30 గంటలకు మ్యూజియం సూపర్‌వైజర్ రౌండ్‌కు వచ్చేవారు. ఉదయం 10:30 నుంచి 11:00 గంటల వరకు మధ్యాహ్న భోజనం వడ్డించేవారు. 11 గంటల నుంచి తిరిగి విద్యాదానం కొనసాగేది. మధ్యాహ్నం 12.30 గంటలకు టీ, 12.35 నుంచి 1.30 గంటల వరకు విశ్రాంతి. 1.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కంప్యూటర్ విద్య, ఇతర అంశాలపై అవగాహన కల్పించేవారు. సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు యోగా, 4.30 గంటల నుంచి బ్యారక్‌ను శుభ్రం చేయడం వంటి ట్రెనింగ్ ఉండేది. సాయంత్రం 5.30 గంటలకు భోజనం ముగిసిన తర్వాత 6 గంటలకు లాకప్‌లో ఉంచేవారు. ఇలా ఇక్కడ సుమారు 50 మంది వరకు జైలు జీవితం కూడా గడిపారు. ఇదంతా గతం. కరోనా ఎఫెక్ట్‌తో జైలు మూతబడింది. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరింది. భారీ వర్షాలకు కాంపౌండ్‌వాల్ పడిపోయింది. ప్రభుత్వం స్పందించి ఫీల్ ది జైల్‌ను పునరుద్ధరించాలని పర్యాటకులు కోరుతున్నారు.

### ఫీల్ ది జైల్ ప్రారంభించాలి



శిథిలమైన ఫీల్ ది జైల్‌కు రిపేర్ చేయించాలి. పర్యాటకశాఖ స్పందించి చర్యలు తీసుకోవాలి. జైలు జీవితం అనుభవించాలనుకునే వారికి అవకాశం కల్పించాలి. ఈతరం వారికి జైలు అంటే ఎలా ఉంటుందో తెలియజేయాలి.

– అఖిల్ యాదవ్, సంగారెడ్డి

### ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలి



సంగారెడ్డిలోని మ్యూజియం జైలును పునరుద్ధరించేందుకు ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలి. జైలు జీవితంపై యువతకు అవగాహన కల్పించాలి. చెడు మార్గంలో నడవకుండా, నిజజీవితంలో జైలు జీవితమంటే ఎంత నరకమో తెలియజేయాలి.

– కూన వేణు, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు

## సమాచార హక్కు చట్టం వజ్రాయుధం

**అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్**



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ మహేందర్

సిద్దిపేటకమాన్: సమాచార హక్కు చట్టం సామాన్యులకు ఓ వజ్రాయుధమని సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ అన్నారు. కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ (సీసీఆర్) సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన జాతీయ సదస్సులో పాల్గొని మాట్లాడారు. వ్యవస్థలో జరుగుతున్న లోపాలను, పారదర్శకతను తెలుసుకునేందు సమాచార హక్కు ఉపయోగపడతుందన్నారు. పట్టణాలతో పాటు పల్లెల్లో సదస్సులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సీసీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా పారదర్శక పాలన సాధ్యమవుతుందని, అవినీతి నిర్మూలనే సీసీఆర్ మొదటి లక్ష్యమని అన్నారు. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డుల తనిఖీ నిర్వహించామని, అవినీతికి పాల్పడిన అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని తెలిపారు. భవిష్యత్‌లో సంస్థ కార్యకలాపాలను విద్య, సామాజిక ఉపాధి కల్పనలకు కూడా విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సదస్సుకు హాజరైన సభ్యులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో సీసీఆర్ కమిటీ సభ్యులు ప్రభు, దేవరాజు, శ్రీనివాస్, సాజిద్ పాషా, శివ, సురేందర్ రెడ్డి, అడ్వకేట్ పత్రి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి తెలంగాణ రోల్ మోడల్



మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు

**ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు**



ముస్లింలకు రంజాన్ కిట్స్ పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్

సిద్దిపేటజోన్: దేశానికి తెలంగాణ రోల్ మోడల్ అని, ప్రజలు కేసీఆర్ వైపు చూస్తున్నారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం మదీన ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో కర్ణాటకకు చెందిన కేంద్ర మాజీ మంత్రి ఇబ్రహీంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలయ్యే సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదని అన్నారు. ఎన్నికల సమయంలో కొత్త బిచ్చగాళ్ల తరహాలో పార్టీలు వస్తాయని, వారిని నమ్మొద్దని అన్నారు. అనంతరం కేంద్ర మాజీ మంత్రి ఇబ్రహీం మాట్లాడుతూ.. ఢిల్లీలో తెలుగు వాడు జెండా ఎగురవేసే సమయం ఆసన్నమైందని, అది కేసీఆర్ ద్వారా సాధ్యం అవుతుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో హరీశ్ రావు భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని దీమా వ్యక్తం చేశారు. హరీశ్ రావు లాంటి నాయకుడు ఉండడం ఈ ప్రాంత వాసుల అదృష్టమని, ఆయన సేవలను బీదర్‌లో కూడా అందించాలని కోరారు. అనంతరం కేంద్ర మాజీ మంత్రి ఇబ్రహీం, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎమ్మెల్సీ ఫారూఖ్‌లకు ఖర్జూర తినిపించారు. ఈ సందర్భంగా 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కాంగ్రెస్ నాయకులు మంత్రి కాన్వాయ్ అడ్డుకునే ప్రయత్నం చేసేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

**పేద విద్యార్థులకు భరోసా**

మెడిసిన్ సీటు సాధించిన ఎన్సాన్ పల్లికి చెందిన సౌమ్యకు మెస్ చార్జీలకు, నర్సింగ్‌లో సీటు సాధించిన గుర్రాలగొందికి చెందిన మనీషాకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. కొండ భూదేవి గార్డెన్‌లో ముస్లింలకు రంజాన్ కానుకలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంత రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంపత్, మాజీ చైర్మన్ రాజనర్స్, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## టీజీసీజీటీఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక




ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

సిద్దిపేటఎడ్యుకేషన్: తెలంగాణ ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్(టీజీసీజీటీఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ రమేశ్‌బాబు, ప్రధానకార్యదర్శిగా శ్యాంసుందర్, కోశాధికారిగా మంజుల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ అయోధ్యరెడ్డి, డాక్టర్ సీహెచ్ మధుసూదన్ తదితరులు అభినందించారు.

# నాచగిరి.. భక్తజన సిరి



పూజలు చేస్తున్న భక్తులు

**భక్తులతో కిటకిటలాడిన పుణ్యక్షేత్రం**

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ నాచగిరి పుణ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు క్షేత్రాన్ని సందర్శించి ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించారు. స్వామివారి నిజాభిషేకం, కల్యాణం, సత్యనారాయణస్వామి వ్రతమాచరించి మొక్కులు తీర్చుకున్నారు. గర్భగుడిలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని తరించారు. క్షేత్రంలో 30 నిజాభిషేకాలు, 6 కల్యాణాలు, 19 వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయసిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

# వర్షం.. మిగిల్చిన నష్టం

- 2,795 ఎకరాల్లో దెబ్బతిన్న వరి
- రూ.150 కోట్లకుపైగా నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా



వడగండ్ల వానతో చెల్లాపూర్‌లో దెబ్బతిన్న వరి

దుబ్బాకటౌన్: అకాల వర్షం రైతులను ఆగమాగం చేసింది. పంట చేతికివచ్చే దశలో కురిసిన వడగండ్ల వానకు వరి చేలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వడగండ్లతో వరిపైరు నేలవాలగా, మరోవైపు పొలంలోనే ధాన్యం గింజలు రాలిపోయాయి. తెగులు నివారణకు అదనంగా వ్యయం చేసి మందులు చల్లి, పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడిన అన్నదాతలకు అకాల వర్షం కోలుకోలేకుండా చేసింది. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

### జిల్లా వ్యాప్తంగా..

- యాసంగిలో జిల్లా వ్యాప్తంగా సుమారు 3.31లక్షల ఎకరాల్లో వరిపంట సాగైనట్లు అధికారుల అంచనా.
- గత శుక్రవారం తెల్లవారుజామున గాలివానతో పాటు వడగండ్లు బీభత్సం సృష్టించాయి.
- దుబ్బాకతో పాటు చెల్లాపూర్, మల్లాయపల్లి, బల్వంతాపూర్, పద్మశాలిగడ్డ, రాజక్కపేట గ్రామాలతో పాటు సిద్దిపేట నియోజకవర్గంలోని చింతమడక, సీతారాంపల్లి గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది.
- ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన వ్యవసాయాధికారులు పంటనష్టాన్ని పరిశీలించారు.
- జిల్లా వ్యాప్తంగా సుమారు 2,795 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్లు అంచనా వేశారు.
- చెల్లాపూర్‌లోనే 1,200 ఎకరాల్లో 90 శాతంకు పైగా వరిపంట దెబ్బతినగా, మిగతా గ్రామాల్లో 70నుంచి 60 శాతం వరకు నష్టం జరిగింది.
- సుమారుగా రూ.150 కోట్లకు పైగా పంట నష్టం జరిగినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.
- పూర్తిస్థాయిలో సర్వే చేపడితే పంట నష్టం పెరిగే అవకాశం ఉంది.
- మామిడి తోటలతో పాటు కూరగాయలు, మొక్కజొన్న పంటలకు సైతం నష్టం వాటిల్లింది. మామిడి 12 నుంచి 15 ఎకరాల్లో, కూరగాయలు సుమారు 10ఎకరాల్లో పాడైనట్లు అంచనా.
- పలు గ్రామాల్లో గాలివానకు చాలా ఇండ్లు దెబ్బతిని నష్టం వాటిల్లింది.
- వడగండ్లతో పంటలు నష్టపోయి తమ పరిస్థితి దయనీయంగా తయారైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ప్రభుత్వం సర్వే చేసి నష్టపరిహారం అందించి ఆదుకోవాలంటూ వేడుకుంటున్నారు.

### గింజలు రాలిపోయాయి



వారం రోజులైతే పంట కోద్దామనుకున్నా. వానతో వరి పంట మొత్తం నాశనమైంది. రెండున్నర ఎకరాలకు రూ.70 వేలకు పైగా పెట్టుబడి పెట్టా. గింజలు పొలంలోనే రాలిపోయాయి. ఏం చేయాలో తెలియడంలేదు.

– పాతూరి అంజిరెడ్డి, రైతు, దుబ్బాక

### నాలుగెకరాల్లో నేలవాలింది



నాలుగెకరాల్లో వరి సాగు చేశా. మొన్న కురిసిన వడగండ్ల వానకు పంటంతా నేలవాలింది. ఇప్పటికే మందులు, ఎరువులకు వేల రూపాయలు ఖర్చు చేశా. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనబడడంలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఉప్పురి నర్సింలు, రైతు, చెల్లాపూర్


### ప్రభుత్వానికి నివేదించాం



వడగండ్ల వాన జిల్లా వ్యాప్తంగా పంటలు పాడయ్యాయి. దుబ్బాక, చెల్లాపూర్, బల్వంతాపూర్, మల్లాయపల్లి గ్రామాల్లో పర్యటించి పంట నష్టంపై ప్రాథమిక అంచనా రూపొందించాం. ఈ నివేదికను ప్రభుత్వానికి పంపించాం.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

# శీతల పానియాలతో అనారోగ్యం



కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

**జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శీతల పానియాలు ఆరోగ్యానికి హానికరమని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తయారు చేసిన కరపత్రాన్ని ఆదివారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి సత్యం మాట్లాడారు. సహజ సిద్ధంగా ఇంట్లో చేసిన మజ్జిగ నిమ్మరసం, అంబలి, పానకం, కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. కూల్‌డ్రింక్స్ సేవించడం వల్ల అదనపు కేలరీలతో స్థూలకాయం ఏర్పడి దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతాయని, వీటితో మధుమేహం వచ్చే ప్రమాదం కూడా ఉందన్నారు. అంతేకాకుండా దంతాలపై ఉండే ఎనామిల్ పొర కరిగి పిప్పళ్ళు వస్తాయని, జీర్ణ వ్యవస్థలో సమస్యలు ఏర్పడతాయని, వీటికి దూరంగా ఉండడం మంచిదని సూచించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక కోశాధికారి సాదత్ అలీ, భగవంతయ్య, బాలకిషన్, భూపతి రెడ్డి, అంజనకుమార్, దేవయ్య, నాగేశ్వర్ రావు, శంకరయ్య, అజీజ్, పద్మయ్య పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### విగ్రహావిష్కరణకు తరలిరండి



మాట్లాడుతున్న జనార్దన్‌రెడ్డి

దుబ్బాక: పట్టణంలోని అంగడి బజార్‌లలో నెలకొల్పిన కొత్వాల్ రాజాబహదూర్ వెంకట్రామిరెడ్డి విగ్రహ ఆవిష్కరణకు జిల్లాలోని రెడ్డి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని మండల రెడ్డి జేఏసీ అధ్యక్షుడు గడీల జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం హాస్టళ్లను నెలకొల్పి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి రాజాబహదూర్ చేసిన సేవలు మరువలేనివన్నారు. రెడ్డి హక్కుల సాధనకు పోరాడిన మహోన్నతమైన వ్యక్తి వెంకట్రామిరెడ్డి అని కొనియాడారు. సోమవారం నిర్వహించే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు హాజరవుతున్నారని సూచించారు. కావున రెడ్డి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి జేఏసీ నాయకులు రాంరెడ్డి, రాంచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, తదితరులున్నారు.

### పాడె మోసిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



చేర్యాల(సిద్దిపేట): బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు తండ్రి ముస్త్యాల రామయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆదివారం పట్టణ కేంద్రానికి వచ్చి మృతదేహంపై పుష్పగుచ్ఛంఉంచి నివాళులర్పించిన అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. అదేవిధంగా అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, పచ్చిమడ్ల సతీశ్, ఆడెపు నరేందర్, మార్కెట్ వైస్ చైర్మన్ పూర్మ వెంకట్‌రెడ్డి, నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, శివగారి అంజయ్య తదితరులున్నారు.

### భక్తిభావంతో సాగిన నగర సంకీర్తన



నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలోని సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి ఆదివారం తెల్లవారుజామున రామచంద్రస్వామి భక్తులు నిర్వహించిన నగర సంకీర్తన భక్తి భావంతో సాగింది. భక్తులు శ్రీరామ భజన పాటలు పాడుతూ డప్పు చప్పుళ్లతో గ్రామంలో తిరుగుతూ నగర సంకీర్తన చేశారు. నగర సంకీర్తన చేస్తున్న భక్తులను ప్రజలు స్వాగతించారు. నగర సంకీర్తన చేసిన వారికి ప్రసాద దాతగా జైన కృష్ణమూర్తి దంపతులు నిలిచారు. కార్యక్రమంలో చిన్నపిల్లలు, పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి



లద్నూర్‌లో ఆరబోసిన వరి ధాన్యం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. వరి కోతలు పూర్తయి ధాన్యం విక్రయానికి సిద్ధంగా ఉందని, వర్షాలు కురిస్తే ధాన్యం తడిసే అవకాశం ఉందని వాపోయారు. అధికారులు త్వరగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు.

### ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ప్లాంట్



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వజ్రోత్సవాల కమిటీ కన్వీనర్ కొండా లక్ష్మణ్

హుస్నాబాద్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు వీ నెట్ ఫౌండేషన్, పాఠశాల పూర్వ విద్యార్థి ఎర్రం రఘునందన్‌రెడ్డి వాటర్ ప్లాంట్‌ను వితరణ చేశారు. ఈ వాటర్ ప్లాంట్‌ను వజ్రోత్సవాల కమిటీ కన్వీనర్ కొండా లక్ష్మణ్ సమక్షంలో పాఠశాల హెచ్‌ఎం బండారి మనీల ప్రారంభించారు. వీ నెట్ ఫౌండేషన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# పొంచి ఉన్న ప్రమాదం

- కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు
- ఇనుప స్తంభాలతో భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ధర్మాజీపేట ప్రధాన రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్

దుబ్బాక: విద్యుత్ సమస్యలు తలెత్తకుండా 24 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరాకు ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రెండు మూడు గ్రామాలకు ఒక్కటి చొప్పున విద్యుత్ ఉప కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. లోవోల్టేజీ సమస్యలను తీర్చేందుకు ట్రాన్స్‌ఫార్మర్లు సైతం ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చేస్తున్నారు. కాగా గ్రామాల్లో, పట్టణాల్లో చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలం అవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- దుబ్బాక పట్టణంలో 15వ వార్డులో గల బాలికల వసతి గృహం నుంచి గాంధీ విగ్రహం వరకు ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా 14వ వార్డులోని శాస్త్రి విగ్రహం వద్ద ఉన్న ఇనుప స్తంభం ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది.
- మండల పరిధిలోని మల్లాయపల్లి, చెర్వాపూర్, ధర్మాజీపేట, చెల్లాపూర్, రాజక్కపేట, దుబ్బాక పట్టణంలో పొలాల వద్ద ఉన్న ఇనుప స్తంభాలను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.
- గతంలో మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో ఇనుప స్తంభాల సమస్య ఇబ్బందిగా ఉండడంతో పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా పాలకవర్గం, విద్యుత్ అధికారుల సమన్వయంతో ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు.
- కానీ పట్టణంలో ప్రధానంగా 15వ వార్డులో దారి పొడవునా ఇనుప విద్యుత్ స్తంభాలు అలాగే ఉన్నాయి. పలుమార్లు విద్యుత్ అధికారులకు సమస్యను విన్నవించుకున్నా ఫలితం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో వార్డుప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.

**ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు**

దుబ్బాక పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద, లాల్ బహాదూర్ శాస్త్రి విగ్రహం వద్ద, ధర్మాజీపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో, చీకోడ్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు పక్కనే తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో పశువులు మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్లకు తగిలి మృత్యువాత పడ్డ ఘటనలు కూడా ఉన్నాయి.

**కాలయాపన చేస్తున్న అధికారులు**

- ఇనుప స్తంభాలతో ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు కాలయాపన చేస్తున్నారే తప్పా తొలగించి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ప్రమాదాలు జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సిమెంట్ స్తంభాల ఏర్పాటుతో పాటు, తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న లూజ్‌వైర్లను, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి పట్టణ ప్రజలకు, రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చేయాలని కోరుతున్నారు.



దుబ్బాక తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో ఇనుప స్తంభం

### స్తంభాలు తొలగించాలి



ఇనుప స్తంభాలతో ప్రమాదం పొంచి ఉంది. వానలు పడితే షాక్‌కు గురయ్యే అవకాశం ఉంది. పట్టణంలో ఉన్న ఇనుప స్తంభాలన్నింటినీ వెంటనే తొలగించాలి.

– మాదబోయిన శ్రీకాంత్, దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు

### జాప్యం చేస్తున్నారు

రైతులంటే విద్యుత్ అధికారులకు చిన్నచూపు ఎందుకు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్యలు వచ్చిన, వైర్లు తెగిన సమస్యను విద్యుత్ అధికారులకు విన్నవించుకుంటే తీవ్ర జాప్యం చేస్తున్నారు. విద్యుత్ వైర్లు తెగి మా పొలంలో పడగా సమస్యను పరిష్కరించాలని కోరితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకొని రైతులకు కరెంట్ సమస్యలు వచ్చినప్పుడు త్వరగా పరిష్కరించాలి. –బట్టు రాజయ్య , రైతు, దుబ్బాక

### సమస్యలు పరిష్కరిస్తాం



పట్టణంలో చాలా వరకు సిమెంట్ స్తంభాలను వేశాం. అక్కడక్కడ కొన్ని చోట్ల ఇనుప స్తంభాలు ఉన్నాయి. వాటిని తొలగించి కొత్తగా సిమెంట్ స్తంభాలను వేసేలా కృషి చేస్తాం. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం.

– రామాంజనేయులు, విద్యుత్ ఏఈ, దుబ్బాక

# బీటీరోడ్డు ప్రొసీడింగ్ అందజేత



సర్పంచ్‌కు ప్రొసీడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

కోహెడరూరల్(హుస్నాబాద్): మండల కేంద్రం నుంచి కూరెల్ల గ్రామం వరకు బీటీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైన ప్రొసీడింగ్‌ను హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సర్పంచ్ గాజుల రమేశ్‌కు అందించారు. ఆదివారం బీటీరోడ్డు మంజూరు చేయడంపై గ్రామస్తులతో కలసి సర్పంచ్ ఎమ్మెల్యేను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అయన ప్రొసీడింగ్ అందించారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ఆవుల మహేందర్, నాయకులు సురేష్, తిరుపతి, రవీందర్, నగేశ్, మల్లయ్య, రాంచంద్రం, మంజుల రాజు, రేణుక, కొమురయ్య, లక్ష్మి, స్రవంతి తదితరులు ఉన్నారు.

**పలు కుటుంబాలకు పరామర్శ**

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గోవర్ధనగిరి, రేగొండ గ్రామాల్లో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, ఉపాధ్యక్షుడు ఇసంపల్లి రవి, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సీతారాముల గరుడ సేవ



గరుడవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని సీతారామ ఉమామహేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణ పురవీధుల్లో సీతారామ చంద్రస్వామి గరుడవాహన సేవ నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలో సదస్యం కార్యక్రమం వైభవంగా జరగగా శివాలయంలో వీరభద్రీయంను అద్భుతంగా జరిపించారు. ఈ సందర్భంగా భక్తులు అగ్నిగుండాలను దాటారు.

### వైఎస్ షర్మిల దీక్షకు తరలిరావాలి

హుస్నాబాద్: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో నిర్వహించే వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిరసన దీక్షకు నిరుద్యోగులు తరలిరావాలని ఆ పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ మల్లికార్జున్‌రెడ్డి కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పరీక్ష పేపర్ల లీకేజీలతో నిరుద్యోగులు నష్టపోయారన్నారు.

# అగ్ని ప్రమాదాలను అరికడుదాం



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

హుస్నాబాద్: అగ్ని ప్రమాదాలను అరికట్టి జాతి సంపదను పెంపొందిద్దామని అగ్ని మాపక సిబ్బంది అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు డాక్టర్లు, సిబ్బంది, అందులో ఉన్న రోగులను ఎలా రక్షించుకోవాలో వివరించారు. అగ్గి ప్రమాదాన్ని చల్లార్చే పరికరాలు కార్బన్ డై యాక్సైడ్, డీసీపీ సిలిండర్లను ఉపయోగించే విధానాలపై వివరణాత్మకంగా తెలియజేశారు. ఆస్పత్రిల్లో అత్యవసర సమయాల్లో బయటకు రావడానికి ఎగ్జిట్ బోర్డ్ క్లియర్‌గా కనిపించే విధంగా ఉండాలన్నారు. అగ్గి ప్రమాదం జరిగినప్పుడు బహుళ అంతస్తుల్లో ఎట్టి పరిస్థితుల్లో లిఫ్ట్‌ను వాడరాదన్నారు. కార్యక్రమంలో ఫైర్ అవుట్ పోస్టు ఇన్‌చార్జ్ నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

# కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ సప్తదశ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధానార్చకుడు శేషం శ్రీనివాసాచార్యుల వైదిక నిర్వహణలో ఆదివారం సుప్రభాతసేవ, వేద పారాయణం, ద్రావిడ దివ్య ప్రబంధం, నిత్య ఆరాధన, శాత్తుముర్రై తీర్థ ప్రసాదగోష్టి కార్యక్రమాలు జరిగాయి. అలాగే యాగశాలలో శాంతిపాఠము, ధ్వజకుంభ ఆరాధనలు, హవనము, నిత్య పూర్ణాహుతి, బలిహరణము నిర్వహించారు. సాయంత్రం సమయంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణము, నిత్య హవనము, చతుస్థానార్చన, ద్వారతోరణ, ధ్వజకుంభ ఆరాధనలు, నిత్య పూర్ణాహుతితో పాటు రాత్రి సమయంలో శ్రీగోదా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ పాలకమండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు.



కల్యాణానికి తరలివచ్చిన భక్తులు

### ఘనంగా ఇఫ్తార్



ముస్లింలతో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి

చేర్యాల(సిద్దిపేట): రంజాన్ మాసం ఉపవాస దీక్ష సందర్భంగా పీసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదివారం పట్టణ కేంద్రంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ముస్లింలందరికీ రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేశారు. మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అన్నారు. అల్లా దయతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థిస్తున్నానన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగరావు, భాస్కర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, బడేమియా, అబ్దుల్ కరీం, రఫత్, అసద్, రహీం, ఖాజా, మల్లేషం, నర్సింహులు, నర్సింహారెడ్డి, సిద్ధిరాములు, సురేశ్, మహేశ్, శ్రీనివాస్, కనకరాజు, అంజిరెడ్డి, దుర్గయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్, ఆదిల్, అర్షద్, రాంబాబు, శ్రీధర్ పాల్గొన్నారు.

# బ్యాంకింగ్ సేవలు మెరుగుపరుస్తాం

డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి



బ్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి తదితరులు

కొండపాక(గజ్వేల్): గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నామని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహదేవ్‌గౌడ్, రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబ, ఎంపీటీసీ గురజాడ బాలాజీ, ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్‌లతో కలిసి డీసీసీబీ బ్యాంకు నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు మిద్దె శంభయ్య, శాలయ్య, బూర్గుల సురేందర్‌రావు, దాసరి మల్లేశం, నర్సింహాచారి, రైతుబంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు దోమల ఎల్లం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మంచాల శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, నాగరాజు, రామ్మోహన్, చిట్యాల నర్సింలు, చంద్రమౌళి, కనకరాంలు, ఆరుట్ల కనకయ్య, పాతర్లకొండల్, చింతకింది రఘు, యాదగిరి, పంజాల శ్రీనివాస్, జైపాల్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రజాచైతన్య బస్సుయాత్ర విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అశోక్

చేర్యాల(సిద్దిపేట): ఈ నెల 18న చేర్యాలలో జరిగే ప్రజాచైతన్య బస్సు యాత్ర విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని వేచరేణిలో ప్రజా చైతన్య బస్సు యాత్ర జయప్రదం చేయాలంటూ ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తూ బీజేపీ హటావో దేశ్‌కో బచావో పేరుతో పల్లె పల్లెకు సీపీఐ బస్సుయాత్ర రాష్ట్రంలో 119 నియోజకవర్గాల్లో పర్యటిస్తుందన్నారు. అందులో భాగంగా ఈ నెల 18న చేర్యాల మండల కేంద్రానికి వస్తున్న బస్సు యాత్రను జయప్రదం చేసేందుకు ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ నాయకులు శ్రీనివాస్, మమత, కనకయ్య, ఆంజనేయులు, బాల్‌రాజు, దుర్గయ్య, యాదగిరి, ఎల్లయ్య, రాజయ్య, చందు, లింగం, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు సర్టిఫికెట్లు ఇవ్వొద్దు

చేర్యాల(సిద్దిపేట): ఇటీవల పదో తరతగతి పరీక్షలు రాసిన విద్యార్థులు తొందరపడి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు సర్టిఫికెట్లు ఇవ్వొద్దని భారత విద్యార్థి ఫెడరేషన్ చేర్యాల డివిజన్ అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి కోరారు. ఆదివారం పట్టణ కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో కొన్ని ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులను మోసం చేసి అడ్మిషన్ చేసుకొని తర్వాత ఇబ్బందులకు గురి చేశాయన్నారు. ప్రస్తుతం 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఎవరూ అడ్మిషన్ల పేరుతో ఇంటికి వచ్చే కళాశాల యాజమాన్యాలను నమ్మొద్దన్నారు. ఎవరైన ఇంటి వద్దకు వెళ్లి అడ్మిషన్లు చేస్తే అలాంటి కళాశాలపై ఇంటర్మీడియట్ విద్యాధికారికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డివిజన్ నాయకులు అరుణ్, అరవింద్, రాకేష్ రెడ్డి, సాయిరాం, యశ్వంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

# దళితరత్న అవార్డుల అందజేత



మంత్రి కొప్పుల ఈశ్వర్ నుంచి అవార్డు అందుకుంటున్న యాదగిరి



అవార్డు అందుకుంటున్న మల్లికార్జున్

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రానికి చెందిన మండల యాదగిరి దళిత రత్న అవార్డును అందుకున్నారు. దళితుల అభ్యున్నతి కోసం పాటు పడుతున్న మండల యాదగిరికి డా. బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా హైదరాబాద్‌లో దళిత రత్న అవార్డును అందుకున్నారు. తనను ప్రోత్సహించిన మాల మహానాడు నాయకులు అద్దంకి దయాకర్, పిల్లి సుధాకర్, భైరి రమేశ్, వెన్న రాజులకు ఈ సదర్భంగా మండల యాదగిరి కృతజ్ఞతలు తెలిపారు.

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహించిన దళితరత్న అవార్డుల ప్రదానం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వడ్లూరు గ్రామానికి చెందిన రాసూరి మల్లికార్జున్‌కు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న మల్లికార్జున్ దళితుల హక్కుల కోసం పోరాటాలు చేయడాన్ని గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. తనకు అవార్డు అందించిన మంత్రి కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మేడి రాజీవ్ సాగర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే


దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



బీజేపీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం దుబ్బాక పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట నియోజకవర్గం నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్‌కు చెందిన వివిధ పార్టీలకు చెందిన దేవరాజు, అనిల్‌రెడ్డి, పరశురాములు, రాజు, శ్రీనివాస్‌గౌడ్, స్వామిలతో పాటు 20 మంది యువకులు ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ కుటుంబ పాలనపై ప్రజలు విసుగుతో ఉన్నారని, బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు ఎదురుచూస్తున్నారన్నారు. సిద్దిపేటలో సైతం బీజేపీ జెండాను ఎగురవేస్తామన్నారు. సిద్దిపేట నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున బీజేపీలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బాలేష్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్, నారాయణరావుపేట మండల బీజేపీ నాయకులు బాబు, శ్రీకాంత్‌గౌడ్, సుంకోజి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

# అయ్యప్ప ఆలయ అభివృద్ధికి సహకరించాలి



కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: అయ్యప్ప ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు. పట్టణంలోని అయ్యప్ప ఆలయ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపడుతూ ఆలయ అభివృద్ధిలో నూతన కమిటీ సభ్యులు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీపీ దాసరి అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్‌లతో పాటు అయ్యప్ప ఆలయ నూతన కమిటీ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు దుర్గం, ప్రధాన కార్యదర్శి రవి, సభ్యులు శ్రీనివాస్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

### కోతుల బెడదకు విముక్తి



కోతులను పడుతున్న దృశ్యం

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని గాంధీనగర్ ప్రజలు కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామ సర్పంచ్ భారతికి విన్నవించారు. దీనిపై గ్రామస్తులందరూ సమాలోచన చేసి కోతులను పట్టి అడవులకు తరలించాలని నిర్ణయించారు. ఆదివారం కోతులకు బోను ఏర్పాటు చేయగా కోతులు అందులోకి చేరడంతో వాటిని తీసుకెళ్లి భూపాల్‌పల్లి అడవుల్లో వదిలేసినట్లు చెప్పారు. కోతులు పట్టడంతో గ్రామస్తులకు, రైతులకు కోతుల నుంచి విముక్తి కలిగింది.